జేహెచ్ఐసీ కార్యదర్శికి సత్కారం

జేహెచ్ఎంసీ కార్యదర్శి రాజేశ్వర్‌రావును సత్కరిస్తున్న ప్రముఖులు, సభ్యులు

బంజారాహిల్స్,ఏప్రిల్ 19: ఏడాది కాలంలోనే జాతీయ స్థాయిలో మూడు టెన్నిస్ టోర్నీలు నిర్వహించి జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్(జేహెచ్ఐసీ) ప్రతిష్ఠను పెంచిన జేహెచ్ఐసీ కార్యదర్శి కిలారు రాజేశ్వర్‌రావును శనివారం సభ్యులతోపాటు వ్యాపారవేత్తలు, జూబ్లీహిల్స్‌కు చెందిన ప్రముఖులు సత్కరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా హైదరాబాద్‌లో టెన్నిస్‌కు ప్రోత్సాహం అందిస్తూ కార్యదర్శి కిలారు రాజేశ్వర్‌రావు చొరవతో జేహెచ్ఎంసీలో 3 టెన్నిస్ టోర్నీలు నిర్వహించడంతో జాతీయస్థాయి గుర్తింపు దక్కిందని ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐపీఎస్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రియదర్శిని రామ్, రాఘవరెడ్డి, లగడపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి..

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 19: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ నగర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏండ్ల తరబడి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే కార్మికులు చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఐక్యతతో ముందుకు సాగి హక్కులను సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

వరంగల్ సభకు భారీగా తరలివెళ్దాం..

● నార్సింగి మున్సిపాలిటీ సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి పటోళ్ల కార్తిక్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ ఇన్‌చార్జి పి.కార్తిక్‌రెడ్డి, పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ, ఏప్రిల్ 19 : రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఎక్కడ చూసినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధే కనిపిస్తుంది తప్ప కొత్తగా చేసిందేమీ లేదని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పటోళ్ల కార్తిక్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో రజతోత్సవ సభ నిర్వహించనున్నారు. సభ విజయవంతానికిగాను నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తిక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధే ప్రస్తుతం రాష్ట్రంలో కన్పిస్తున్నదని, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు చేసింది శూన్యమన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోనూ నాటి సీఎం కేసీఆర్ సర్కారు చేపట్టిన అభివృద్ధి తప్ప ఎక్కడా కొత్త పనులు చేసిన దాఖలాలు లేవన్నారు. విజన్‌తో పరిపాలన చేపట్టి అన్ని వర్గాల ప్రజలకు సంపూర్ణ న్యాయం చేయడమే బీఆర్ఎస్ లక్ష్యమన్నారు. పార్టీ రజతోత్సవ వేడుకలను నార్సింగి మున్సిపాలిటీ నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. గ్రామాల వారీగా ప్రణాళికలను సిద్ధం చేసుకుని జిల్లా అధిష్టానానికి అందజేయాలని సూచించారు. గులాబీ సైనికులంతా బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం వివిధ గ్రామాల నాయకులు కార్తిక్‌రెడ్డిని సన్మానించారు.

పార్టీ మున్సి పాలిటీ అధ్యక్షుడు కె.విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు మహమూద్, నాయకులు కొల్లూరు ఆనంద్ ముదిరాజ్, ప్రవీణ్‌కుమార్,గణేశ్, ప్రియాంక, నిజాముద్దీన్, ఫారూఖ్, శ్రీకాంత్‌రెడ్డి, దాసు, వెంకటేశ్, విష్ణువర్ధన్, సంతోష్, గణేశ్‌రెడ్డి, మహిపాల్, వేణు, రఘు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందార్ల సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

అభివాదం చేస్తున్న జేఏసీ నాయకులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 19 : గొర్రెల పెంపకందారుల సహకార సంఘాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించి, ఫెడరేషన్ చైర్మన్‌ను ఎన్నుకోవాలని ఆయా సంఘా జేఏసీ రాష్ట్ర కార్యదర్శి సుందబోయిన ప్రసాద్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం సాయంత్రం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్‌సీడీసీ ద్వారా నిధులను నేరుగా సంఘాలకే ఇవ్వాలని, దానికి అనుబంధంగా కోఆపరేటీవ్ బ్యాంకులకు అవకాశం ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో గొర్రెల సంఖ్యకు అనుగుణంగా మందులను సరఫరా చేయాలని, జీవాలకాపరులకు బీమా పథకాలు అమలు చేయాలన్నారు. 50 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ ఇవ్వాలన్నారు. సమావేశంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, జేఏసీ ప్రతినిధులు బక్కన్న యాదవ్, అజయ్ యాదవ్,వాసు యాదవ్, ఉమ్మడి నల్గొండ జిల్లా డీఎస్‌బీసీఎస్ చైర్మన్ సుధాకర్ యాదవ్, తిరుపతి యాదవ్, గట్టయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు

ఓల్డ్ కర్నూల్ రోడ్డుపై నిలిచిన నీటి తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఉపకమిషనర్ రవికుమార్

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 19: డ్రైనేజీ నీరు, వర్షపు నీరు రోడ్లపై చేరకుండా సాఫీగా వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్ అన్నారు. శనివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పాత కర్నూల్ రోడ్డు, గగన్‌పహాడ్ ప్రాంతాల్లో నీరు నిలిచిపోయిన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. పాతకర్నూల్ రోడ్డు, గగన్ పహాడ్ ప్రాంతాల్లో డ్రైనేజీల్లో తక్షణమే వ్యర్థాలను తొలగించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కొంతమంది భవన నిర్మాణ వ్యర్థాలను రోడ్ల పక్కనే డంప్ చేస్తున్నారని, వారిని గుర్తించి జరిమానాలు విధిస్తామన్నారు. ప్రజలు సైతం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ డ్రైనేజీల్లో వ్యర్థాలు వేయవద్దని సూచించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ కాలనీ పార్కులో క్లీనింగ్ పనులు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

బంజారాహిల్స్,ఏప్రిల్ 19: పార్కుల నిర్వహణలో జీహెచ్ఎంసీ యూబీడీ విభాగం నిర్లక్ష్యంపై 'నమస్తే తెలంగాణ'లో 'పార్కుకు వచ్చేదెలా.. సేద తీరేదెట్ల..' అనే శీర్షికన శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే కాలనీని అనుకుని ఉన్న ఫొటోగ్రాఫర్ కాలనీలో ట్రీ పార్కులో జీహెచ్ఎంసీ యూబీడీ విభాగం అధికారులు శనివారం ఉదయం క్లీనింగ్ పనులు ప్రారంభించారు. విపరీతంగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. పార్కులోని వ్యర్థాలను తరలించారు. పార్కులో మొక్కలకు వేసవిలో నీరు అందించేలా చర్యలు తీసుకుంటామని యూబీడీ అధికారులు తెలిపారు. ఫొటోగ్రాఫర్స్ కాలనీపార్కుపై అధికారులు నిర్లక్ష్యం వీడి ఇకనుంచి రెగ్యులర్‌గా దృష్టి పెట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఫొటోగ్రాఫర్స్ కాలనీ జీహెచ్ఎంసీ పార్కులో చెత్తను తొలగిస్తున్న యూబీడీ సిబ్బంది

రోడ్లపై కూలిన చెట్లు.. తొలగించని అధికారులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 19: నగరంలో శుక్రవారం సాయంత్రం గాలి వానబీభత్సానికి రోడ్లపై భారీ వృక్షాలు నేలరాలాయి. అనేక చోట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఫలితంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో పాటు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ శాఖలు సరైన చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నెక్లెస్ రోడ్‌లో సుమారు ఐదు కిలోమీటర్ల పరిధిలో పదుల సంఖ్యలో పెద్ద చెట్లు రోడ్డుపై అడ్డంగా పడిపోయాయి. 24 గంటలు దాటినా చెట్లను తొలగించకపోవడంపై పాదచారులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనం అందిద్దాం..

● వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ జానయ్య

యూనివర్సిటీ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జానయ్య తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, ఏప్రిల్ 19: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 116వ అకడమిక్ కౌన్సిల్ సమావేశం శనివారం ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య అధ్యక్షతన రాజేంద్రనగర్‌లోని వర్సిటీ ఆడిటోరియం సెమినార్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. మారుతున్న వాతావరణ పరిస్థితులు, మార్కెట్ పరిస్థితులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత టెక్నాలజీల నేపథ్యంలో శాస్త్రవేత్తల పరిశోధనలు మారాలని సూచించారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) కాలానుగుణంగా పునర్వ్యవస్థీకరణ అవుతున్నదని, ఆ దిశగానే వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మార్పునకు శ్రీకారం చుట్టామన్నారు. విశ్వవిద్యాలయంలో 300 బోధన సిబ్బంది ఖాళీల భర్తీకి ప్రభుత్వ అనుమతి కోరామన్నారు. అదే విధంగా 10 మంది నేపాల్ విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు. పీహెచ్‌డీ చేసిన ప్రతి విద్యార్థికి నెలకి రూ. 30 వేల ఉపకార వేతనం ఇస్తూ రెండేళ్ల పాటు విశ్వవిద్యాలయంలోనే పోస్ట్ డాక్టోరల్ అకడమిక్ అప్రెంటిస్‌షిప్ చేసుకునే అవకాశం ఉందన్నారు.

'నాణ్యమైన విత్తనం – రైతుకు నేస్తం' పేరుతో జూన్ 2న రాష్ట్రంలోని 12వేల గ్రామాల్లో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. వరి, కందులు, పెసలు,మినుములు, జొన్న పంటలకు సంబంధించి ఒక గ్రామంలో 3 నుంచి ఐదుగురు రైతులకు సుమారు 40 వేల మంది రైతులకు నాణ్యమైన విత్తనం అందజేస్తామన్నారు. సాగుకు సంబంధించిన అంశాలపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు మే 6 నుంచి జూన్ 13వ వరకు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' పేరుతో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. శాస్త్రవేత్త బీఎస్సీ చివరి సంవత్సరం విద్యార్థి, పీజీ విద్యార్థులతో కలిసి రైతుల వద్దకు వెళ్లాలన్నారు. విశ్వవిద్యాలయాన్ని అత్యుత్తమ ర్యాంకుల జాబితాలో నిలపడానికి కృషి చేయాలన్నారు. కౌన్సిల్ సమావేశంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, విశ్వవిద్యాలయ అధికారులు, అకడమిక్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'రన్ ఫర్ జీసస్'

ఫిలింనగర్‌లో రన్ ఫర్ జీసస్ ర్యాలీని ప్రారంభిస్తున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్

బంజారాహిల్స్,ఏప్రిల్ 19: ఖైరతాబాద్ నియోజకవర్గం ఫాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిలింనగర్‌లో శనివారం 'రన్ ఫర్ జీసస్' పేరుతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఏసుక్రీస్తు పునరుజ్జీవాన్ని చాటి చెప్పేందుకు ఈస్టర్ ముందు రోజు అన్ని ప్రాంతాల్లో రన్ ఫర్ జీసస్ ర్యాలీలు నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు బి.పీటర్ తెలిపారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాయల్ ప్రభాకర్, జీవన్, జార్జి విలియం, కృపారావు, సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ పరిధిలో..

జూబ్లీహిల్స్ : యేసుక్రీస్తు మరణాన్ని జయించి పునరుత్థానుడయ్యాడని.. సమాధిని గెలిచాడని ఉత్సాహంగా క్రైస్తవులు శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. ఆరాధన టీవీ అధ్వర్యంలో నగర వ్యాప్తంగా నిర్వహించిన ఈ ర్యాలీలో స్థానిక చర్చిల పాస్టర్లు, ప్రతినిధులు, క్రైస్తవ యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్పొరేటర్లు రన్ ఫర్ జీసస్ ర్యాలీకి స్వాగతం పలికారు. రహమత్ నగర్‌లో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి రన్ ఫర్ జీసస్ ర్యాలీలో పాల్గొన్న అందరికీ వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. వెంగళరావునగర్ డివిజన్‌లో కార్పొరేటర్ దేదీప్యరావు 'రన్ ఫర్ జీసస్' కార్యక్రమంలో పాల్గొని క్రైస్తవులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తదితరులు

సిగరెట్ తెచ్చివ్వలేదని బీరుసీసాతో దాడి

వెంగళరావునగర్, ఏప్రిల్ 19 : సిగరెట్ తెచ్చి ఇవ్వలేదన్న కోపంతో స్నేహితుడి తలపై బీరుసీసాతో దాడికి పాల్పడిన ఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రహ్మత్ నగర్‌కు చెందిన మహ్మద్ ఫయామ్(33) వృత్తిరీత్యా పెయింటర్. ఈ నెల 16న ఫయామ్‌ను అతడి స్నేహితుడు శివ రహ్మత్‌నగర్‌లోని తన ఇంటికి పిలిచాడు. అక్కడ మరికొందరితో కలిసి మ ద్యం సేవించిన ఫయామ్ ఆ రాత్రి అక్కడే నిద్రించాడు. మర్నాడు మధ్యాహ్నం నిద్రిస్తున్న ఫయామ్‌ను కొండాపూర్‌కు చెందిన స్నేహితుడు గోపి నిద్రలేపి సిగరెట్ తెచ్చివ్వాలని కోరాడు. వెళ్ళలేనని ఫయామ్ బదులిచ్చే సరికి గోపి కోపోద్రిక్తుడయ్యాడు. నాకే ఎదురు చెప్తావా.. చంపేస్తానంటూ గోపి బీరు సీసాతో ఫయామ్ తలపై బలంగా మోదాడు. దాంతో ఫయామ్ తల పగిలి తీవ్ర గాయాలుకాగా ధవాఖానాకు తరలించారు. గోపిపై చర్యలు తీసుకోవాలని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవన నిర్మాణ సంఘం మహాసభలను జయప్రదం చేయాలి

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 19: భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. శనివారం శంషాబాద్ పట్టణంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21,22న శంషాబాద్‌లో నిర్వహించే భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలన్నారు. 21న శంషాబాద్ ఆర్టీసీ బస్‌స్టాండ్ నుంచి ఎంఎంఆర్ గార్డన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి ఎంఎంఆర్ గార్డన్‌లో బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బహిరంగసభకు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసిజిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, గౌరవాధ్యక్షుడు రామస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్‌రెడ్డి,కార్యదర్శి నరసింహ, సీపీఐ మండల కార్యదర్శి నర్రగిరి తదితరులు పాల్గొన్నారు.

మే డేను విజయవంతం చేయాలి

మే డేను విజయవంతం చేయాలని కోరుతూ శంషాబాద్ పట్టణంలో శనివారం మేడే వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 19: పురుగులమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతానికి చెందిన మల్లేశ్‌యాదవ్(35) భార్య, పిల్లలతో కలిసి ఉంటున్నాడు. బేగం బజార్‌లో మిర్చి వ్యాపారం చేస్తు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్ని నెలల క్రితం మల్లేష్‌యాదవ్‌కు టీబీ ఉన్నట్లు నిర్ధారణ అయింది. అప్పటి నుంచి ఎక్కువగా మద్యం సేవిస్తూ బాధపడుతున్నాడు. శుక్రవారం రాత్రి పురుగుల మందు తెచ్చుకొని తాగి నిద్రపోయాడు. ఉదయం కుటుంబ సభ్యులు మల్లేశ్‌యాదవ్‌ను నిద్ర లేపేందుకు ప్రయత్నించగా ఆయన లేవలేదు. దీంతో ఆందోళనకు గురై ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 19: భారీ వర్షానికి కరెంటు తీగలు తెగి రోడ్డుపై పడటంతో దానిని చూసుకోకుండా వెళ్లిన ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముఖేష్(40) బతుకుదెరువు కోసం వచ్చి ఎల్‌బీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. బండ్లగూడ ప్రాంతంలోని ఓ నిర్మాణ భవనంలో టైల్స్ మేస్త్రీగా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి పనులు ముగించుకోని స్నేహితుడు మనోజ్‌తో కలిసి ఎల్‌బీనగర్‌కు బయల్దేరాడు. భారీ వర్షం కురియడంతో వారి ద్విచక్ర వాహనంలోకి వర్షం నీరు వెళ్లి బైక్ స్టార్ట్ కాలేదు. అప్పటికే గాలి వీయడంతో కరెంటు తీగలు తెగిపడి వర్షం నీళ్లలో పడిఉన్నాయి. ద్విచక్ర వాహనాన్ని నెట్టుకుంటూ వెళ్తుండగా నీళ్లలో పడిన కరెంటు తీగలకు తగిలి ముఖేశ్ కిందపడిపోయాడు. స్థానికులు గమనించి పక్కకు తీయగా అప్పటికే మృతి చెందాడు. విషయాన్ని పోలీసులకు తెలుపడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకోని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సమస్యలను పట్టించుకోని అధికారులు..!

● 'గుడ్‌మార్నింగ్ మణికొండ'లో బీఆర్ఎస్ నాయకులకు మొర పెట్టుకున్న ప్రజలు

సెక్రటేరియట్ కాలనీలో స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ,ఏప్రిల్ 19 : మణికొండ మున్సిపాలిటీలో ఎక్కడికక్కడ సమస్యలు తిష్టవేశాయి. అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదంటూ సెక్రటేరియట్ కాలనీవాసులు మండిపడుతున్నారు. శనివారం బీఆర్ఎస్ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు సీతారాం దూళిపాళ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గుడ్‌మార్నింగ్ మణికొండ– ప్రజాభిప్రాయ సేకరణ' కార్యక్రమంలో భాగంగా సెక్రటేరియట్ కాలనీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పర్యటించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు అనేక సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సరఫరా సరిగ్గా లేకపోవడంతోపాటు జలమండలిశాఖ లైన్ మెన్లు చేతివాటానికి అలవాటై సమస్యలను పరిష్కరించడం లేదని మండిపడ్డారు.

అదేవిధంగా విద్యుత్ ఓల్టేజీ సమస్యలు అధికంగా ఉన్నాయని, ఫలితంగా ఇళ్లలోని ఫ్రిడ్జ్‌లు, టీవీలు ఇతర ఎలక్ట్రికల్ సామగ్రి కాలిపోతున్నాయని తెలిపారు. చారిత్రాత్మక గండిపేట చెరువు నుంచి నగరానికి తరలించి నీటి కాలువ(కాండూట్) సెక్రటేరియట్ కాలనీ పరిధిలో చిల్లులు పడి కిలోమీటర్ల పొడవునా నీటి ప్రవాహిస్తోందన్నారు. ఇదే విషయాన్ని జలమండలిశాఖ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. కాలనీలో రాత్రి సమయాల్లో పోలీస్‌పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీ ప్రధాన వీధుల్లో అపరిశుభ్రత తిష్టవేసిందన్నారు. పుప్పాలగూడ పైప్‌లైన్ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ పెరుగుతున్నందున మద్యం షాపులను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకుల దృష్టికి తీసుకువచ్చారు.

అధికారులను కలిసి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని సీతారాం తెలిపారు.కార్యక్రమంలో ధన్‌రాజ్, నరేందర్,లక్ష్మణ్‌రావు, బాబు, మాల్యాద్రినాయుడు, రాజు, ఉపేంద్రనాథ్‌రెడ్డి, శ్రీకాంత్, సుమనళిని, శ్రీధర్, శ్రీనివాస్, బాలాజీ,దేవేందర్,కిరణ్, తిరుపతి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అద్దె వివాదంలో ట్రాన్స్‌జెండర్లు.. రౌడీలతో దౌర్జన్యం

● విశ్రాంత ఉద్యోగిని ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్,ఏప్రిల్ 19: అద్దె విషయంలో వివాదం తలెత్తి ఇంటి యజమానిపై ట్రాన్స్‌జెండర్లతో పాటు రౌడీలను పంపించి దౌర్జన్యానికి దిగిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో నివాసం ఉంటున్న విశ్రాంత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిని, మాజీ ఐఏఎస్ సతీమణి ఇందుకూరి నిర్మలాదేవికి బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2లోని ఎన్‌టీఆర్ ట్రస్ట్ భవన్ వెనకాల ఓ భవనం ఉన్నది. ఈ భవనాన్ని గత ఏడాది జూన్‌లో ఆద్య ఎడ్యుకేషన్ సొసైటీకి లీజుకు ఇచ్చారు. అడ్వాన్స్ చెల్లించడంతో పాటు నెలనెలా అద్దె ఇస్తానంటూ సొసైటీ నిర్వాహకులు, మాజీ ఐఏఎస్ కుమారుడు గొబ్బూరు సాయి కృష్ణకిశోర్ చెప్పారు. అనంతరం ఈ ఇంటి అద్దె విషయమై వివాదం చోటు చేసుకోవడంతో శనివారం మధ్యాహ్నం భవనంలోకి సుమారు 10మంది రౌడీలతో పాటు ట్రాన్స్‌జెండర్లు, మహిళలు ఒక్కసారిగా ప్రవేశించి వీరంగం సృష్టించారు. లోపల ఉన్న నిర్మలాదేవిని బయటకు తరిమివేశారు. దాంతో నిర్మలాదేవి బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం ఇవ్వగా పెట్రోలింగ్ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. కొంతమంది రౌడీలు పారిపోగా, ఆరుగురు ట్రాన్స్‌జెండర్లు, పలువురు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిర్మలాదేవి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

స్లాట్ బుకింగ్ వద్దు.. పాత పద్ధతే కొనసాగించాలి

శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 19 : రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్‌తో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. పాతపద్ధతినే కొన